

జగన్‌తోనే ఆర్యవైశ్యుల సంక్షేమం
సీఎం వైఎస్ జగన్‌తోనే ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధి సాకారమవుతోందని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,360
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,690
3 శాతం జీఎస్టీతో	రూ.5,861
నవర (8 గ్రా)	రూ.46,888

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.9 /28.0

మంగళవారం గాలిలో 60 శాతం తేమ ఉంది. బుధవారం అధిక ఉష్ణోగ్రతలు కొన సాగుతాయి. ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు పాలిసెట్ ప్రవేశ పరీక్ష
- 11 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 2,503 మంది విద్యార్థులు

నెల్లూరు(టౌన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్‌ను బుధవారం నిర్వహించనున్నారు. ప్రవేశ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనుంది. నెల్లూరు డివిజన్‌లోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల, డీకే డబ్ల్యూ జూనియర్, డిగ్రీ కళాశాలలు, వీఆర్‌ఐపీఎస్, జగన్స్ డిగ్రీ కళాశాల, ఎస్సార్‌కే ఇంగ్లిష్ మీడియం స్కూల్, కావలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆత్మకూరు డివిజన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నలంద ఇంగ్లిష్ మీడియం స్కూల్, ప్రగతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లలో కలిపి మొత్తం 11 కేంద్రాల్లో ఈ పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 2,503 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

సబ్సిడీపై పశుదాణామృతం
నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని పాడి రైతులకు బుధవారం నుంచి సబ్సిడీపై పశుదాణామృతం పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో పశుదాణామృతం లభ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుతం 600 మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉందని, ప్రతి రైతుకు 18 కేజీల వరకు సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే పశుగ్రాసం విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

590 పొగాకు బేళ్లు కొనుగోలు
మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రైతుల వద్ద నుంచి 590 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి బి.రాజశేఖర్ తెలిపారు. దుత్తలూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 614 బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాగా 24 బేళ్లను వివిధ కారణాలతో వేలంలో తిరస్కరించినట్లు తెలిపారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.175 నమోదైందన్నారు. 10 కంపెనీల బయ్యర్లు వేలంలో పాల్గొని 72,141 కిలోల పొగాకును రూ.1,41,97,518లకు రైతుల వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు.

సోమశిలలో 48.575 టీఎంసీలు
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 48.575 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 183 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 2450 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 96.055 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

కిసాన్ డ్రోన్లు వస్తున్నాయ్

యాంత్రీకరణ వ్యవసాయ రంగంలో భారీ మార్పులను తీసుకువస్తోంది. విత్తు విత్తినప్పటి నుంచి పంటపై పురుగుమందు పిచికారీ చేసేందుకు కూలీలు అందుబాటులో లేక రైతు పడే అనేక వ్యయప్రయాసలకు డ్రోన్లతో చెక్ పడనుంది. వీటి వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చి పంటలను తెగుళ్ల బెడద నుంచి కాపాడాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.

– సాక్షి, నెల్లూరు డెస్క్



పురుగుమందు స్ప్రే చేస్తున్న డ్రోన్

- పురుగుమందులు, ద్రవరూప ఎరువులు ఇక యంత్రం ద్వారానే పిచికారీ
- రైతు గ్రూపులకు డ్రోన్లు అందజేయనున్న ప్రభుత్వం
- పంట చేలకు తొలగనున్న చీడపీడల బెడద
- ప్రతి గ్రూపునకు ఒక పైలట్ నియామకం
- అన్నదాతలకు అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు

మానవ రహితంగా గాలిలో ఎగురుతూ వ్యవసాయ క్షేత్రంలో పంటలను పర్యవేక్షించే యంత్రమే వ్యవసాయ డ్రోన్. ఇది తీసే చిత్రాల ఆధారంగా పైరు ఎదుగుదల ఎలా ఉంది.. చీడపీడలు ఏవైనా ఆశించాయా.. ఎక్కడెక్కడ పైరు దెబ్బ తిన్నది వంటి విషయాలను తెలుసుకోవచ్చు. ఒకవేళ ఎక్కడైనా పురుగుమందు పిచికారీ చేయాల్సి ఉంటే ఈ యంత్రం ద్వారానే సులువుగా నిమిషాల్లో పని పూర్తిచేయవచ్చు.

గ్రూపులు ఎలా ఏర్పడాలంటే..

డ్రోన్ కావాలనుకున్న వారు ఐదుగురు కలిసి ముందుగా ఒక గ్రూపుగా ఏర్పడాలి. వీరంతా రైతు కుటుంబాలకు చెందిన వారై ఉండాలి. వీరిలో ఒకరిని డ్రోన్ పైలట్‌గా నియమించి ప్రభుత్వం అతనికి శిక్షణ ఇప్పిస్తుంది. పైలట్‌గా ఎంపిక కావాలంటే వ్యవసాయ పట్టభద్రుడై ఉండాలి. అతనికి భారత పాస్‌పోర్టు కూడా ఉండాలి. ఇంజినీరింగ్ లేదా డిప్లొమా చేసిన వారూ అర్హులే. వీరు ఆర్బీకేలకు పది కిలోమీటర్ల పరిధి లోపు వారై ఉండాలి.

జిల్లాలో ఎన్ని గ్రూపులకు..

మండలానికి మూడు చొప్పున జిల్లాలోని 37 మండలాల్లో మొత్తం 111 రైతు గ్రూపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. డ్రోన్ల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరిస్తున్నారు. ప్రతి రైతు గ్రూపునకు ఒక పైలట్ ఉంటారు. అతనే డ్రోన్‌ను ఆపరేట్ చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రోన్లను రైతులకు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

పైలట్‌లకు శిక్షణ

మొదటి ఫేజ్‌లో జిల్లాలో 20 మంది పైలట్‌లకు శిక్షణ ఇప్పించాలని అధికారులు ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 10 మందిని ఎన్జీ రంగా వర్సిటీకి చెందిన గుంటూరు లాంఫాంకు పంపగా అక్కడ 12 రోజులపాటు శిక్షణ పొందారు. అక్కడ వారికి భోజన, నివాస వసతిని కూడా ప్రభుత్వమే ఉచితంగా కల్పించింది. జిల్లా నుంచి మరో ముగ్గురు ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. మరికొందరు ముందుకు వస్తే వారికి కూడా శిక్షణకు పంపిస్తామని అధికారులు తెలిపారు.

ఖరీదు ఎంతంటే..

డ్రోన్ ఖరీదు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుంది. రైతు గ్రూపులకు 40శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తుంది. మిగిలిన సొమ్ములో సగం రైతులు భరిస్తే మిగతా మొత్తాన్ని బ్యాంక్ రుణంగా పొందవచ్చు. డ్రోన్ వినియోగాన్ని బట్టి ఆదాయం పొంది రుణం తిరిగి చెల్లించవచ్చు. ఈ యంత్రం ద్వారా ఒక ఎకరానికి పురుగుమందు లేదా ద్రవ రూపంలో ఉన్న ఎరువును పది నిమిషాల్లో స్ప్రే చేయవచ్చు. గంటకు ఆరు ఎకరాల చొప్పున రోజుకు దాదాపు 50 ఎకరాల్లో మందు పిచికారీ చేయవచ్చని అంటున్నారు.



డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

సేద్యంలో ఉపయోగం
ప్రస్తుతం పొలానికి పురుగుమందు చల్లాలంటే రైతులు లేదా కూలీలు పవర్ స్ప్రేయర్లు వినియోగిస్తున్నారు. మందు చల్లే సమయంలో దాని ఘాటుకు కొందరు అస్వస్థతకు గురికావడం, స్పృహ తప్పి పడిపోవడం కూడా జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు శాస్త్రవేత్తలు వ్యవసాయంలో ఉపయోగించేలా డ్రోన్లను తయారు చేశారు. అదునులో కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్న రైతులు డ్రోన్లను వినియోగించుకుని సకాలంలో తెగుళ్ల బెడద నుంచి పంట పొలాలను సంరక్షించుకునే వీలుంది.

రైతుల్ని చైతన్యవంతం చేస్తున్నాం



డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రూపులుగా ఏర్పడే రైతులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. పైలట్‌కు 12 రోజులు శిక్షణ ఇప్పిస్తాం. అందుకయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. శిక్షణ పొందిన వారికి మున్ముందు డిమాండ్ బాగా ఉంటుందని భావిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సుధాకర్‌రాజు, డీఏఓ, నెల్లూరు

అవగాహన కల్పించారు



రైతు కుటుంబానికి చెందిన నేను బీటెక్ చదివాను. సేద్యంలో ప్రయోగాలు చేయడం ఎంతో ఇష్టం. వ్యవసాయశాఖ అధికారుల సూచనలతో పైలట్ శిక్షణకు లాంఫాం వెళ్లాను. అక్కడ మాకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంత ఎత్తులో యంత్రం ఉండాలి.. రిమోట్ ద్వారా వాటి దిశ మార్చడం నేర్పించారు. డ్రోన్ పరికరం ఇవ్వగానే సొంతంగా పొలంపై పురుగుమందు స్ప్రే చేస్తా.

– పల్లంరెడ్డి జశ్వంత్‌రెడ్డి, పెనుబర్తి గ్రామం

రైతులకు మేలు



నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. తండ్రి బాటలోనే వ్యవసాయం చేస్తున్నాను. అధికారుల సూచనలతో లాంఫాంకు పైలట్ శిక్షణకు వెళ్లాను. అక్కడ 12 రోజులపాటు డ్రోన్ వినియోగం, పురుగుమందులు చల్లడంపై అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో డ్రోన్ల వినియోగం వ్యవసాయంలో ఎక్కువగా ఉంటుంది. రైతులకు వాటి వల్ల ఎంతో మేలు జరుగుతుంది.

– బి.వెంకటశేషయ్య, జట్లకొండూరు, మనుబోలు మండలం

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి పర్యటనను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఈ నెల 12వ తేదీన కావలిలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి కాకాణి, కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి మంగళవారం కావలి ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి కాకాణి, కలెక్టర్ హరినారాయణన్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. అనంతరం బహిరంగసభ నిర్వహించే ప్రదేశాన్ని, ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్దాలుగా చుక్కల భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలను గుర్తించిన సీఎం వైఎస్ జగమోహహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. చుక్కల భూముల సమస్య ఎదుర్కొంటున్న రైతులకు కావలి వేదికగా ఈ నెల 12వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 43 వేల ఎకరాలకు సంబంధించి 23 వేల మంది రైతులు చుక్కల భూముల సమస్య నుంచి విముక్తి కానున్నట్లు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ ప్రభుత్వం చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినందున భూములకు సంబంధించిన పాస్‌పుస్తకాలను రైతులకు అందించేందుకు ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి కావలికి వస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, నుడా వైస్ చైర్మన్ టి.బాపిరెడ్డి, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు శీనానాయక్, కరుణకుమారి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డీటీసీ చందర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, జిల్లా ప్రజా రవాణా అధికారి శేషయ్య, డీఆర్డీఏ, డ్వామా, మెప్మా, ఏపీఎంఐపీ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, రవీంద్ర, శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వరరావు, డీఈఓ గంగాభవాని, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఈలు రంగవరప్రసాద్, అశోక్ కుమార్, కావలి తహసీల్దార్ కె.మాధవరెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ యు.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'
ప్రారంభం సంతోషకరం



కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అధికారులు

- సీఎం వర్చువల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్



'జగనన్నకు చెబుదాం' వర్చువల్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజల సమస్యలను నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేలా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని వర్చువల్‌గా లాంఛనంగా మంగళవారం ప్రారంభించగా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఏఎస్పీ హిమవతి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అన్నిశాఖల అధికారులను భాగస్వామ్యం చేస్తూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 1902 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవచ్చని, సీఎం కార్యాలయం నుంచి ప్రత్యేక బృందాలు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డ్వామా పీడీ వెంకట్రావ్, హౌసింగ్ పీడీ వెంకటదాస్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ కె.సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇళ్లు భద్రం

- వేసవి వేళ అజాగ్రత్తగా ఉండొద్దు
- యాప్‌లో వివరాలు నమోదు చేసుకుంటే చాలు
- రూపాయి ఖర్చు లేకుండా పోలీస్ సేవలు
- సాంకేతికతతో చోరీలకు చెక్

వేసవి సెలవుల నేపథ్యంలో అనేక మంది విహార యాత్రలకు వెళ్తుంటారు. రోజుల తరబడి ఇంట్లో ఎవరూ ఉండరు. ఇదే దొంగలకు కలిసొచ్చే అంశం. రెక్కీ వేసి దోచేస్తుంటారు. చోరీలకు చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. అదే ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం). ఇందులో వివరాలు నమోదు చేసుకుంటే ప్రశాంతంగా ఉండొచ్చు.

నెల్లూరు(క్రైమ్): విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో అనేకమంది విహారయాత్రలు, తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. మరికొందరు వేసవి ఉక్కపోతకు తట్టుకోలేక ఇంటికి తాళం వేసి మిద్దెపైన నిద్రిస్తుంటారు. ఇంకొందరు తలుపులు తీసి నిద్రపోతుంటారు. ఇదే అదునుగా భావించి దొంగలు అందినకాడికి దోచుకెళ్తుంటారు. గతంలో జరిగిన చోరీ ఘటనలే ఇందుకు నిదర్శనం.

ఎవరూ లేరని గుర్తించి..

దొంగలు ఎక్కువగా పగటిపూట వీధుల్లో తిరుగుతుంటారు. ఇళ్ల ముందు ముగ్గులు వేయకపోయినా, దినపత్రికలు రోజుల తరబడి గేటుకే ఉన్నా, ఆవరణ శుభ్రంగా లేకపోయినా అక్కడ ఎవరూ లేనట్లు గుర్తిస్తారు. అర్ధరాత్రి దాటాక చొరబడి నగలు, నగదు, విలువైన



ఎల్‌హెచ్‌ఎంఎస్ అమర్చిన ఎఫ్‌సీఐ కాలనీలోని ఇంటి వద్ద పోలీస్ గస్తీ

వస్తువులను ఎత్తుకుపోతారు. వేసవి తాపానికి ఆరుబయట లేదా మిద్దెపైన నిద్రిస్తాం. సాధారణంగా ఇంటి తాళాన్ని తలగడ కింద పెట్టుకుంటాం. దొంగలు నెమ్మదిగా తాళం చిక్కించుకుని కిందకొచ్చి అందినకాడికి దోచేస్తారు. వీలైతే మెడలోని నగలను కత్తిరించుకుపోతారు. ఇక వాహన దొంగతనాల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. చోరీల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలతోపాటు స్వీయ జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాల బారిన పడకుండా ఉండవచ్చు.

ఏం చేయాలంటే..

- ఊర్లకు వెళ్లేవారు బంగారు, వెండి ఆభరణాలు, డబ్బు బ్యాంకు లాకర్లలో దాచుకోవడం ఉత్తమం.
- ఇంటికి సెక్యూరిటీ అలారం మోషన్ సెన్సార్‌ను అమర్చుకుంటే మేలు. సెంట్రల్ లాక్ ఉండేలా చూసుకోవాలి.
- ఊరెళుతున్న సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి.
- నమ్మకమైన వ్యక్తులనే కాపలాదారులుగా పెట్టుకోవాలి. వారి శాశ్వత చిరునామా, ఎక్కడి నుంచి వచ్చారు. ఆధార్ ఇతర వివరాలు సేకరించాలి.
- సీసీ కెమెరాల ఫుటేజీని ఎప్పటికప్పుడు మొబైల్‌లో చూసే ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఇంటిపై ఓ కన్నేయమని ఇరుగుపొరుగు వారికి చెప్పాలి.
- ఒంటరిగా ఉండేవారు రాత్రి వేళల్లో ఇంటి తలుపులు తీసేముందు బయట వ్యక్తులను పరిశీలించుకోవాలి.


ఈ యాప్‌తో..

తాళం వేసి ఉన్న ఇల్లు కనిపిస్తే చాలు. దొంగలు చేతివాటం ప్రదర్శించడానికి ప్రయత్నిస్తారు. చెమటోడ్చి దాచుకున్న డబ్బును క్షణాల్లో దోచుకెళ్తారు. పోలీస్ శాఖ రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో చోరీలకు చెక్ పెట్టొచ్చు. ఈ యాప్‌ను ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం రిజిస్టర్ అనే ఆప్షన్‌ను ఎంచుకుని అందులో ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. వన్ టైం పాస్‌వర్డ్, యూజర్ ఐడీ వస్తుంది. ఎప్పుడైనా ఊరికి వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి. ఎప్పుడు వెళ్లేది.. ఎప్పుడు తిరిగొచ్చేది తదితర సమాచారం టైప్‌చేసి సబ్మిట్ చేయాలి. సమాచారం అందుకున్న పోలీసులు ఊరికి వెళ్లే ముందు రోజున మీ ఇంటికి వచ్చి వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, మోడెం తదితర పరికరాలు అమర్చి వెళ్తారు. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీసుల నిఘాలో ఉంటుంది. దొంగలు వచ్చి తాళం పగులగొట్టే ప్రయత్నం చేస్తే అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఈ సమాచారం వెంటనే పోలీసులకు వెళ్తుంది. వారు తక్షణమే తగిన చర్యలు తీసుకుంటారు. ఈ సేవలు పూర్తిగా ఉచితం.

అవగాహన అవసరం

ఎల్‌హెచ్‌ఎంఎస్ గురించి ఇంకా అనేకమందికి తెలియదు. జిల్లా జనాభా సుమారు 24 లక్షలు ఉండగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారు, సేవలను వినియోగించుకున్న వారు కేవలం వేలల్లోనే ఉన్నారు. దీనిపై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గతంలో పలువురు రిక్వెస్ట్ వాచ్ పెట్టుకోగా.. ఆ ఇళ్లకు దొంగతనం చేసేందుకు వెళ్లిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీలను కట్టడి చేశారు.

గస్తీ పెంచాం



వేసవిలో చోరీల కట్టడికి ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో పగలు, రాత్రి గస్తీని పెంచాం. ఊర్లకు వెళ్లేవారు విధిగా తమ సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలి లేదా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోండి. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100, 112కు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

ఆదిపరాశక్తి కామాక్షితాయి

శరణని వేడిన వారి మనసుల్లో కొలువై కోరిన కోర్కెలు తీర్చే అమ్మ జొన్నవాడ కామాక్షితాయి అని భక్తులు విశ్వసిస్తారు. పెన్నానదిలో జాలర్లకు వలలో చిక్కిన పార్వతీదేవి ప్రతిమ శ్రీమల్లికార్జునస్వామి సమేతంగా కామాక్షితాయిగా జొన్నవాడ క్షేత్రంలో పూజలందుకుంటోంది. ఆదిపరాశక్తి అయిన ఈ అమ్మవారిని నమ్మి కొలిస్తే అనుక్షణం తమను బిడ్డల్లా చూసుకుంటుందని భక్తులు నమ్ముతారు. కాగా కామాక్షితాయి అమ్మవారికి ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా జరిపించేందుకు ఆలయ పాలకమండలి ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ క్రమంలో భక్తులు వేలాదిగా అమ్మవారిని దర్శించుకోనున్నారు.


జొన్నవాడ ఆలయం (ఇన్‌సెట్లో) కామాక్షితాయి

- నమ్మి కొలిచే వారి కొంగుబంగారం
- నేటి నుంచి జొన్నవాడలో వార్షిక బ్రహ్మోత్సవాలు
- 20వ తేదీ వరకు వేడుకలు
- వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించనున్న అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ క్షేత్రంలో వెలసిన శ్రీమల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పాలకమండలి, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశారు.

క్షేత్ర విశిష్టత

నెల్లూరుకు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న జొన్నవాడ క్షేత్రంలో శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయం 1150వ సంవత్సరంలో నిర్మితమైంది. పూర్వం పెన్నానది సమీపంలో జరిగిన తవ్వకాల్లో శివుని విగ్రహం బయటపడిందని, ఆ విగ్రహాన్ని ఆ ప్రాంతంలో ఉన్న ఒక జమీందారు ఇంట్లో ఉంచారని భక్తులు చెబుతారు. జమీందారు ఇంట్లో ఉన్న గోమాత తన గోక్షీరంతో ఆ విగ్రహానికి అభిషేకాలు చేసేదని, ఒకరోజు మల్లికార్జున స్వామి జమీందారుకు కలలో కనిపించి తనకు ఆలయం నిర్మించాలని కోరడంతో ఆలయాన్ని నిర్మించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇదిలా ఉండగా త్రేతాయుగంలో కశ్యప మహాముని ఈ ప్రాంతంలో యజ్ఞం చేస్తుండగా అందులోని అగ్నికీలల నుంచి దివ్యతేజస్సు ఉద్భవించి అది మల్లికార్జునస్వామి రూపం దాల్చిందని పురాణాలు చెబుతున్నాయని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. కశ్యప మహాముని యజ్ఞం చేసిన ఈ ప్రదేశం యజ్ఞవాటిక అయిందని, యజ్ఞవాటికకు అసలు పేరు జన్నవాడ కాగా కాలక్రమేణా అది జొన్నవాడగా రూపుదిద్దుకుందని భక్తులు చెబుతున్నారు.

ఉత్సవాలు ఇలా..

జొన్నవాడ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 10వ తేదీన అంకురార్పణ, 11న ధ్వజారోహణ, 12న శేషవాహనసేవ, 13న పురుషామృగ వాహనసేవ, 14న సింహ వాహనసేవ, 15న హంస వాహనసేవ, 16న రావణసేవ, 17న వెండి నందిసేవ, 18న రథోత్సవం, 19న కల్యాణోత్సవం, 20వ తేదీన ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయ పాలకమండలి, అధికారులు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీటి వసతులను ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి బస్సు సౌకర్యం, ఇతర వాహనాల రాకపోకలు ఉంటాయి.


భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

జాలర్ల పూజలందుకున్న కామాక్షితాయి

పెన్నానదిలో జాలర్లు చేపల వేట చేస్తుండగా వారి వలకు పార్వతీదేవి విగ్రహం చిక్కింది. వారు అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఒకచోట ఉంచి నిత్యం పూజలు చేసేవారు. ఆ పూజల సమయంలో అమ్మవారికి మాంసాహారాన్ని నైవేద్యంగా సమర్పించి అనంతరం దానిని జాలర్లు తినేవారు. దీంతో అమ్మవారు ఆగ్రహంతో ఆదిశక్తిరూపంలో రగిలిపోయేదని పురాణాలు చెబుతున్నాయి. అయితే ఒకరోజు ఈ ప్రాంతానికి చేరుకున్న కంచి కామకోటి పీఠాధిపతి ఆదిశంకరాచార్యులు అమ్మవారి ఆగ్రహాన్ని గ్రహించి అక్కడ జరుగుతున్న తంతును తెలుసుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని మల్లికార్జున స్వామి విగ్రహం సమీపంలో ప్రతిష్ఠించి ఆ విగ్రహం పాదాల కింద శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. దీంతో అమ్మవారు శాంతస్వరూపిణిగా భక్తులను కటాక్షించడంతో అప్పటి నుంచి భక్తులు అమ్మవారికి శాకాహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తూ పూజలు చేస్తున్నారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పటి నుంచి జొన్నవాడ క్షేత్రంలో అమ్మవారు కామాక్షితాయిగా భక్తుల పూజలందుకుంటోంది.

భక్తులకు మౌలిక వసతులు



జొన్నవాడలో శ్రీమల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంలో అభివృద్ధి చేశాం. బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఆలయంలో అభివృద్ధి పనులు చేయడంతోపాటు దాతల సహకారంతో భక్తుల సౌకర్యార్థం గదులు, తలనీలాలు, మరుగుదొడ్లు, రక్షిత మంచినీటి వసతులను కూడా ఏర్పాటు చేశాం.

– పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఆలయ పాలకమండలి చైర్మన్

ఏర్పాట్లు పూర్తి



జొన్నవాడ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 10వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు పూర్తి చేశాం.

– డి.వెంకటేశ్వర్లు, ఈఓ

సత్ప్రవర్తనతో మెలగాలి

- సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

వెంకటాచలం: జైలు జీవితం అనుభవించిన వ్యక్తులు బయటకు వెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి సూచించారు. వెంకటాచలం మండలం చెముడుగుంట వద్దనున్న జిల్లా కేంద్ర కారాగారంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తుల మధ్య వచ్చే తగాదాలు కోర్టు ద్వారా పరిష్కరించుకోవడానికి అధిక కాలం పట్టడమే కాకుండా ఖర్చుతో కూడిన విషయమని, 1987 సంవత్సరంలో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని ఏర్పాటు చేసి ఉచిత న్యాయసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిందితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలిసీ, తెలియక చేసిన తప్పులు మళ్లీ చేయకుండా సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని సూచించారు. క్షణికావేశాలతో గొడవలు పడడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ సదస్సులో జైలు సూపరింటెండెంట్ కె.రాజేశ్వరరావు, జైలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య


వినీత్ (ఫైల్)


ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరు ఎస్సీకాలనీలో ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు పిడతాపోలూరు సర్పంచ్ వెందోటి రాజకుమారి కుమారుడు వినీత్ (17) పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వినీత్ ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్లాబ్‌కు ఉన్న ఇనుప కొక్కికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కొక్కికి వేలాడుతున్న వినీత్‌ను సోదరుడు చూసి కేకలు వేసి బంధువులను పిలిచాడు. కొన ఊపిరితో ఉన్న వినీత్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వినీత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఎస్సై శివకృష్ణారెడ్డి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కాజ్‌వేకు నిధుల కోసం వినతి

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాజ్‌వేలకు సంబంధించి రూ.98 కోట్లు రెండో విడత నిధులు కావాలని సీఎంను కోరారు. అలాగే ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు మండలాల పరిధిలో నుడాకు సంబంధించి 2005 గృహాలు మంజూరు చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పెద్దాస్పత్రిలో లాపరోస్కోపిక్ పరికరం మాయం


నమూనా లాపరోస్కోపిక్ పరికరం

నెల్లూరు(అర్బన్): స్థానిక దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మదర్ అండ్ చైల్డ్ విభాగంలో ఆపరేషన్ చేసే లాపరోస్కోపిక్ పరికరం మాయమైంది. నూతన టెక్నాలజీతో రోగులకు ఆపరేషన్లు చేసే ఖరీదైన లాపరోస్కోపిక్ పరికరం కనిపించకుండాపోయినట్లు తెలుసుకున్న గైనకాలజీ విభాగం డాక్టర్లు మంగళవారం అంతర్గత విచారణ చేపట్టారు. దీనికితోడు సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ డాక్టర్లతో కూడిన మరో టీంని ఎంక్వైరీ కోసం నియమించారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సూపరింటెండెంట్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అక్కడ పనిచేసే సిబ్బంది సహకారం లేకుండా ఖరీదైన పరికరం మిస్ కాదని సాటి ఉద్యోగులే పేర్కొంటున్నారు. ఇదే విషయమై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా మిస్ అయిన లాపరోస్కోపిక్ పరికరాన్ని రికవరీ చేస్తామని, అందుకు బాధ్యులైన అందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.22

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	: రూ.138
లేయర్ లైవ్	: రూ.95
బ్రాయిలర్ చికెన్	: రూ.238
స్కిన్‌లెస్ చికెన్	: రూ.264
లేయర్ చికెన్	: రూ.162

సీఎం వైఎస్ జగన్‌తోనే ఆర్యవైశ్యుల సంక్షేమం

- నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్


మాట్లాడుతున్న నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆర్యవైశ్యుల సంక్షేమం, అభివృద్ధి సాకారమవుతోందని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. మంగళవారం నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. తన 14 ఏళ్ల పాలనలో చంద్రబాబునాయుడు ఆర్యవైశ్యులకు ఏం ఒరగబెట్టారో చెప్పాలన్నారు. పెదబాబు, చినబాబులిద్దరికీ అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం అలవాటైపోయిందని, కర్నూలులో జరిగిన ముఖాముఖిలో ఆర్యవైశ్యులపై కపటప్రేమ చూపారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నెల్లూరు జిల్లాకు శ్రీపొట్టి శ్రీరాములు పేరును పెట్టి ఆర్యవైశ్యులపై తమ ప్రేమను చాటారని గుర్తుచేశారు. ప్రజాసంకల్పయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే నెరవేర్చడమే కాక బృహత్తరమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ముఖ్యమైన పదవుల కేటాయింపులో ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. అయితే ఆర్యవైశ్యులనుద్దేశించి టీడీపీ నేత నారా లోకేశ్ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడిగా ఉన్న టీజీ భరత్ వాస్తవాలను గమనించుకోవాలని హితవుపలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆర్యవైశ్యులకు చేసిన సహాయ సహకారాలు, అభివృద్ధికి ఆధారాలు ఉన్నాయని, దీనిపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని, మీరు సిద్ధమా అంటూ లోకేశ్‌కు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కోట సూర్యనారాయణ, శ్రీరామ్ సురేష్, కుమార్, సరాబు సుబ్రహ్మణ్యం, గుండ్లపల్లి పద్మప్రియ, మేడా కామేశ్వరరావు, పాదర్తి బాలాజీ, బైసానీ జ్యోతి ప్రసాద్, గాధంశెట్టి గోపాల్, వాయుగుండ్ల సుప్రియ, పద్మజ, చందు, సురేష్, పైడా సత్యం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న కృష్ణాజిల్లా జట్టు


ట్రోఫీ అందుకుంటున్న నెల్లూరు జిల్లా జట్టు

- బాలుర విజేత కృష్ణాజిల్లా, బాలికల విజేత నెల్లూరు జట్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో కృష్ణ, విశాఖ, నెల్లూరు జిల్లాల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. కడప, అనంతపురం జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, నగర అధ్యక్షుడు ఎం.ఈశ్వరయ్య, మండల అధ్యక్షుడు దువ్వూరు శరత్‌చంద్రారెడ్డి, రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. క్రీడాకారులనుద్దేశించి మాట్లాడి బహుమతులను అందజేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రజట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి.రవీంద్ర, స్కూల్ అసిస్టెంట్ ఐ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారి ఇంట్లో చోరీ

- 13 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

చేజర్ల: ఓ కూరగాయల వ్యాపారి ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దుండగులు అపహరించిన ఘటన చేజర్ల మండలంలోని ఆదూరుపల్లిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు ఆదూరుపల్లికి చెందిన గొట్టం గురవయ్య బస్టాండ్ సెంటర్‌లో కూరగాయలు, పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఇంటికి తాళం వేసి కూరగాయల అంగడికి వెళ్లి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఇంటికి వచ్చేసరికి బీరువాలోని 13 సవర్ల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించాడు. వేసిన తాళం వేసినట్టే ఉండడంతో తెలిసిన వారే ఈ పనికి పూనుకొన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉదయం సంగం సీఐ రవినాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మరిడినాయుడు తెలిపారు.



మహాయజ్ఞం ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ


యశాఖ కార్యాలయంలో మహాయజ్ఞం ఆహ్వాన పత్రికలను వివిధ దేవస్థానాలకు చెందిన కార్యనిర్వహణాధికారులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు.

నెల్లూరు(బృందావనం): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – దేవదాయ, ధర్మదాయశాఖ నిర్వహణలో అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞం జరుగనుందని జిల్లా దేవదాయశాఖ అధికారి పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న జిల్లా దేవదాయ, ధర్మాదా

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 69 కేంద్రాల్లో శిబిరాలు


మాట్లాడుతున్న శాప్ బోర్డు డైరెక్టర్ నర్సింహులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మంగళవారం ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 52, నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 17 శిబిరాల్లో మొత్తం 69 కేంద్రాల్లో 27 క్రీడాంశాల్లో జూన్ 10వ తేదీ వరకు ఈ శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ శిక్షణ శిబిరాలను లాంఛనంగా ప్రారంభించిన శాప్ బోర్డు డైరెక్టర్ కాలువ నర్సింహులు మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లీగ్, సీఎం కప్ టోర్నమెంట్స్‌లను కొత్తగా ప్రవేశపెట్టిందన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్‌కుమార్ రెడ్డి, సెట్నల్, డీఎస్ఏ సీఈఓ డి.పుల్లయ్య మాట్లాడుతూ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు విద్యార్థులను క్రీడల వైపు ఆకర్షించేందుకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఆర్‌కే యతిరాజ్, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి కె.గురుప్రసాద్, జాయింట్ సెక్రటరీలు ఎం.గిరిప్రసాద్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎస్.విజయ, వివిధ క్రీడా సంఘాల కార్యదర్శులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.